## పెన్షనర్ల సమస్యలు పరిష్కరిస్తాం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - కడప అర్బన్

పెన్షనర్ల సమస్యలు పరిష్కరిస్తామని కమలాపురం ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి హామీ ఇచ్చారు. శనివారం జిల్లా పెన్షనర్స్ ఎదుర్కొంటున్న సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాసనసభ సమావేశాల్లో ప్రభుత్వానికి విన్నవించి, పరిష్కరించడానికి కృషిచేస్తామని తెలిపారు. ఆర్థిక పరంకాని సమస్యలను వెంటనే నెరవేర్చే ప్రయత్నం చేస్తామని హామీ ఇచ్చారు. పెన్షనర్లకు ప్రభుత్వం అండగా ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో పెన్షనర్స్ సంఘ కార్యదర్శి రామమూర్తి నాయుడు, వర్కింగ్ ప్రెసిడెంట్ నాగముని రెడ్డి, కార్యనిర్వాహక కార్యదర్శి బాల ఎల్లారెడ్డి, అసోసియేట్ ప్రెసిడెంట్ రాధాకృష్ణ, సత్యరాజు పాల్గొన్నారు.

# ష్..గప్‌చుప్!

ప్రలోభాలకు వేళాయే!
యథేచ్ఛగా ఓటుకు నోటు
ఉపాధ్యాయులకు రూ.5 వేలు?
పట్టభద్రులకు రూ.వెయ్యి పంపిణీ?

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

జిల్లాలో ఎన్నికల ప్రచార ఘట్టం ముగియడంతో గప్‌చుప్ వాతావరణం నెలకొంది. పశ్చిమ రాయలసీమ ఎమ్మెల్సీ పరిధిలో శనివారం సాయంత్రం నుంచి బహిరంగ రాజకీయ, ప్రచార, సోషల్ మీడియా ప్రచారం వంటి కార్యకలాపాలకు ఎన్నికల కమిషన్ అడ్డుకట్ట పడింది. ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో దిగిన సుమారు 51 మంది పట్టభద్ర, ఉపాధ్యాయ అభ్యర్థులు ఓటింగ్ పోలరైజేషన్ వైపు దృష్టి సారించారు. పిడిఎఫ్ మినహా అధికార పార్టీ మద్దతుదారుల నుంచి మిగిలిన ప్రత్యర్థుల వరకు ఎవరి స్థాయిలో వారు ప్రలోభాలకు తెరలేపినట్లు తెలుస్తోంది. ఇప్పటికే రాష్ట్ర స్థాయి అధికారుల నుంచి అధికార మద్దతుదారు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థుల వరకు ప్రలోభాలకు పాల్పడడం చర్చనీయాంశంగా మారిన సంగతి తెలిసిందే. పశ్చిమ రాయలసీమ ఎమ్మెల్సీ ఎన్నిక వ్యవహారం రాష్ట్ర స్థాయిని ఆకర్షించింది. ఇటువంటి పరిస్థితుల్లోనే స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నిక ఏకగ్రీవం కావడం అందరి దృష్టినీ ఆకర్షించింది. ప్రచార దశలోనే ప్రలోభాలకు తెరలేచింది. అధికార పార్టీ మద్దతు కలిగిన ఎమ్మెల్సీ అభ్యర్థుల అనుచరులు టిఫిన్ బాక్సుల దగ్గర నుంచి నగదు పంపిణీ వరకు భారీగా ప్రలోభాలకు తెరలేపడం చర్చనీయాంశంగా మారిన సంగతి తెలిసిందే. పశ్చిమ రాయలసీమ ఎమ్మెల్సీ నియోజకవర్గ పరిధిలో 1,41, 400 ఉపాధ్యాయ 2.09,800 పట్టభద్ర ఓటర్లు ఉన్న సంగతి తెలిసిందే. జిల్లాలోని 82 వేల మంది పట్టభద్రులు, సుమారు ఏడు వేల మంది ఉపాధ్యాయులు ఉన్నారు. వీరిలో అత్యధికులకు నగదు పంపిణీ చేసి ప్రలోభాలకు తెరలేపడం చర్చనీయాంశంగా మారింది. అత్యధికంగా ఉపాధ్యాయ ఓటరుకు రూ.ఐదు వేలు, పట్టభద్ర ఓటరుకు రూ.వెయ్యి నుంచి రూ.2 వేల వరకు పంపిణీ చేస్తున్నట్లు సమాచారం. జిల్లా పరిధిలో గత 10 రోజులుగా బద్వేల్ నియోజకవర్గ పరిధిలోని నగదు పంపిణీ వ్యవహారం హాట్‌టాపిక్‌గా మారిందనే వార్తలు వెల్లువెత్తుతుండడం గమనార్హం. శనివారం సాయంత్రంతో ప్రచారఘట్టం ముగిసిన అనంతరం పోలింగ్ సమయానికి 48 గంటలను ఓటింగ్ పోలరైజేషన్ పేరుతో ప్రలోభాల పర్వం జోరందుకునే అవకాశం ఉంది. అధికార పార్టీ పరోక్ష మద్దతు పొందిన ఉపాధ్యాయ, పట్టభద్ర ఎమ్మెల్సీ అభ్యర్థులకు ఏజెంట్ల నియామకం దగ్గర నుంచి పోలింగ్, కౌంటింగ్ దశల వరకు వెసులుబాటు ఉంటుందనే వాదన వినిపిస్తోంది. ఏదేమైనా విద్యావంతులైన ఉపాధ్యాయ, పట్టభద్ర ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటర్లు ఓటింగ్‌లో వివేకాన్ని, విజ్ఞతను ప్రదర్శించే అవకాశం ఉందనే విశ్లేషకుల అంచనాలు ఎలా ఉంటాయో వేచి చూడాల్సి ఉంది.

# పోలింగ్ నిర్వహణకు పటిష్ట ఏర్పాట్లు

### కలెక్టర్ వి.విజయ్ రామరాజు

ప్రజాశక్తి - కడప

ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి పోలింగ్ నిర్వహణకు పటిష్ఠ ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ విజయ్‌రామరాజు సంబంధితాధికారులను ఆదేశించారు. ఈ నెల 12 ఉదయం నుంచి డిస్ట్రిబ్యూషన్ కేంద్రం నుంచి జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాలకు పోలింగ్ సామగ్రిని పటిష్ఠ బందోబస్తు మధ్య తరలించాలని పేర్కొన్నారు. శనివారం కలెక్టరేట్ స్పందన హాలులో ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లపై జెసి సాయికాంత్ వర్మ, శిక్షణా కలెక్టర్ రాహుల్ మీనా, డిఆర్వో గంగాధర గౌడ్‌లతో కలిసి ఎన్నికల నోడల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన పోలింగ్ సామగ్రి డిస్ట్రిబ్యూషన్ కేంద్రం వద్ద పోలింగ్ సామగ్రిని, సిబ్బందిని తీసుకెళ్లే వాహనాల రూట్ నెంబర్ల వారీగా మొత్తం 21 కౌంటర్లను ఏర్పాటు చేశామన్నారు. రూటు వారీగా ఎన్ని వాహనాలు ఏర్పాటు చేశారు ? మ్యాన్ పవర్ ఎంతమంది హాజరవుతున్నారు ? అనే అంశాలపై సమీక్షించారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రం వద్ద కచ్చితంగా పోలింగ్ సిబ్బంది హాజరు నమోదు చేయాలని, ఒక్కో పోలింగ్ స్టేషన్‌కు కేటాయించిన సిబ్బందితో పాటు అదనపు సిబ్బందిని కూడా అందుబాటులో ఉంచుకోవాలన్నారు. అన్ని రూట్లకు వెళ్లాల్సిన వాహనాలను ఆయా కౌంటర్ల వద్ద క్రమపద్ధతిలో ఏర్పాటు చేయాలన్నారు. పోలింగ్ సిబ్బంది ఆదివారం ఉదయమే డిస్ట్రిబ్యూషన్ కేంద్రం వద్ద సిద్ధంగా ఉండాలన్నారు. బ్యాలెట్ బాక్సుల డిస్ట్రిబ్యూషన్ సమయంలో పిఒలు, ఎపిఒలతోపాటు మైక్రో అబ్జర్వర్స్, వెబ్ కాస్టింగ్ సిబ్బందిని కూడా ఆయా కౌంటర్లలో సిద్ధంగా ఉండాలని పేర్కొన్నారు.పోలింగ్ సామాగ్రిని పటిష్ఠ బందోబస్తుతో కేటాయించిన వాహనాలలో తీసుకెళ్లాలన్నారు. ప్రతి పోలింగ్ స్టేషన్ కు పోలీస్ సిబ్బందితో పాటు పోలింగ్ సామగ్రిని తీసుకెళ్లే వాహనం వెంట ఒక పైలెట్ వాహనం, బందోబస్తు వాహనం ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. 108 వాహనాలను కూడా అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ప్రతి డిస్ట్రిబ్యూషన్ సెంటర్ వద్ద పోలింగ్ సిబ్బందికి ఆహారం, తాగునీరు తదితర అన్ని సదుపాయాలను ఎలాంటి ఇబ్బంది లేకుండా ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో ఆర్డీవోలు ధర్మచంద్రారెడ్డి, వెంకట రమణ, డ్వామా, డిఆర్‌డిఎ పీడీలు యదుభూషన్ రెడ్డి, ఆనంద్ నాయక్, ఎస్‌డిసి రామ్మోహన్, వివిధ రకాల విధులను కేటాయించిన నోడల్ పోలీసు అధికారులు పాల్గొన్నారు.

**బ్యాలెట్ బాక్సుల పంపిణీ కేంద్రం పరిశీలన**

ఎమ్మెల్సీ ఎన్నికల ఓటింగ్ కు సంబంధించి కలెక్టరేట్ సభా భవన్‌లో ఏర్పాటు చేసిన బ్యాలెట్ బాక్సుల డిస్ట్రిబ్యూషన్ కేంద్రంలో పోలింగ్ కేంద్రాలకు తరలించేందుకు సిద్ధం చేస్తున్న బ్యాలెట్ పేపర్ల వెరిఫికేషన్, పోలింగ్ బూత్‌ల వారీగా ప్యాకింగ్ చేస్తున్న జంబో బ్యాలెట్ బాక్సులను శనివారం సాయంత్రం జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ విజయ్ రామరాజు పరిశీలించారు . అధికారులకు సూచనలు చేశారు.

అధికారులకు సూచనలిస్తున్న జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ విజయ్‌రామరాజు

## పోలింగ్ సిబ్బంది నియామకం

ప్రజాశక్తి - కడప

పట్టభద్రులు, ఉపాధ్యాయ శాసనమండలి ఎన్నికల పోలింగ్ విధులు నిర్వహించేందుకు అవసరమైన పోలింగ్ సిబ్బందిని ర్యాండమైజేషన్ ద్వారా కేటాయించామని జిల్లా జాయింట్ కలెక్టరు సి.ఎం. సాయి కాంత్ వర్మ అన్నారు. శనివారం స్థానిక కలెక్టరేట్‌లోని ఎన్ఐసిలో ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు సాఫ్టవేర్ ద్వారా 3వ దశ ర్యాండమైజేషన్ ప్రక్రియ జిల్లా జాయింట్ కలెక్టర్ సి.ఎం. సాయి కాంత్ వర్మ సమక్షంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ ఉపాధ్యాయులు, పట్టభద్రులకు జిల్లాలో 131 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. 131 మంది పిఒలు, ఎపిఒలు, ఒపిఒలు, 106 మంది ఒపిఒలు-2, మొత్తం 499 మంది పోలింగ్ సిబ్బంది, అలాగే 131 మంది సూక్ష్మ పరిశీలకులను నియమించామన్నారు. రిజర్వులో 49 మంది పిఒలు, 51 మంది ఎపిఒలు, 135 మంది ఓపివోలు మొత్తం 235 మంది పోలింగ్ సిబ్బంది కాగా 22 మంది సూక్ష్మ పరిశీలకులను రిజర్వులో నియమించామని జేసి తెలిపారు. కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ రాహుల్ మీనా, డిఆర్వో గంగాధర్ గౌడ్, ఎన్ఐసి డిఐఒ టి.ఆర్. విజయకుమార్, సిపిఒ ఏ.వెంకటరావు, కలెక్టరేట్ ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ శివారెడ్డి , ఎన్ఐసి డిఐఒ సత్యనారాయణ పాల్గొన్నారు.

## అధికారం చారిత్రాత్మక అవసరం

### - టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు శ్రీనివాసరెడ్డి

ప్రజాశక్తి -కడప అర్బన్

తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావడం చారిత్రాత్మక అవసరమని తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. నగరంలోని గాయత్రీ టవర్స్‌లో శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి నేతలు భయపడుతూ ఓటర్లను డబ్బుతో ప్రలోభాలు చేస్తున్నారని చెప్పారు. వాలంటరీల ద్వారా దొంగ ఓట్లు వేయించుకునే విధంగా ప్రయత్నాలు చేస్తున్నారని విమర్శించారు. వైసిపి 4 ఏళ్ల పాలనతో చీకటి ఆంధ్రప్రదేశ్‌గా మార్చారని మండిపడ్డారు. అన్ని వర్గాల ప్రజలు వైసిపి పాలనను అసహ్యించుకుంటున్నారని పేర్కొన్నారు. అధికారంలోకి టిడిపి వస్తే అప్పుల ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి ఆంధ్ర ప్రదేశ్‌గా మారుతుందన్నారు. రాష్ట్రంలో అవినీతి, అక్రమాలు పెట్రేగిపోయాయని విమర్శించారు. నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు, ఉద్యోగులకు సిపిఎస్ సమస్యలు పరిష్కారం కావాలంటే టిడిపి అధికారంలోకి రావాల్సిందేనన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలిచి తీరాలన్న ఉద్దేశంతో జగన్ కోట్లాది రూపాయలు వెచ్చిస్తున్నారని ఆరోపించారు. ఉక్కు పరిశ్రమకు అతిగతి లేదని, హైకోర్టు ఏర్పాటుపై జగన్ ప్రభుత్వం మోసం చేసిందన్నారు. కడప, బెంగళూరు రైల్వే మార్గానికి ఒక్క పైసా నిధులు కేటాయించలేదని చెప్పారు. సమావేశంలో రాంగోపాల్ రెడ్డి పాల్గొన్నారు.

## విద్యార్థులను ప్రోత్సహించాలి : ఎంఇఒ

ప్రజాశక్తి - కడప అర్బన్

ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు విద్యార్థులను భవిష్యత్తు గురించి ఆలోచిస్తేనే వాళ్ళ భవిష్యత్తును బంగారు బాటగా తయారు చేయవచ్చని ఎంఇఒ పాలెం నారాయణ అన్నారు. శనివారం నగరంలోని నగరపాలక ఉన్నత పాఠశాల మెయిన్‌లో నగరపాలక ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు నాగమణి ఆధ్వర్యంలో పదవ తరగతి 2022-23 సంవత్సర విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేవలం 20 రోజులు మాత్రమే పబ్లిక్ పరీక్షలకు సమయం ఉందన్నారు. తల్లిదండ్రులు తమ విలువైన సమయాన్ని కేటాయించి చదువు విషయంలో పర్యవేక్షణ చేయాలని సూచించారు. ఇప్పటిదాకా ఉన్న సమయాన్నంతా ఉపాధ్యాయులు విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించి వారి సామర్థ్యాలకు అనుగుణంగా తీర్చిదిద్దారని తెలిపారు. ఉన్న కొద్ది సమయాన్ని తల్లిదండ్రులు విద్యార్థుల కోసం కేటాయించాలని సూచించారు. ముఖ్యంగా పరీక్షా సమయంలో ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. తోటి స్నేహితులతో బయటికి పంపించకుండా వీలైనంత ఎక్కువగా ప్రాక్టీస్ చేయించాలని చెప్పారు. అనంతరం ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు విద్యార్థులు, తల్లిదండ్రులకు, విద్యార్థుల వ్యక్తిగత సామర్థ్యాలను తెలియజేసి ప్రత్యేకంగా ప్రణాళిక ప్రకారం చదువుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిఆర్‌పి కృష్ణ పాల్గొన్నారు.

## 7 వికెట్ల తేడాతో అనంతపురం జట్టు విజయం

ప్రజాశక్తి - కడప

జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక వైఎస్ రాజారెడ్డి ఎసిఎ స్టేడియంలో జరుగుతున్న పి ధనుంజయ రెడ్డి మెమోరియల్ వెటర్న్స్ టి-20 క్రికెట్ టోర్నమెంట్ లో భాగంగా శనివారం ఉదయం నిర్వహించిన మ్యాచ్‌లో విజయవాడ జట్టుపై ఏడు వికెట్ల తేడాతో అనంతపురం జట్టు ఘనవిజయం సాధించి ఫైనల్స్‌కు చేరుకుంది. మొదట బ్యాటింగ్ చేసిన విజయవాడ జట్టు 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 152 పరుగులు చేసింది. ఆ జట్టులోని లెనిన్ 40 పరుగులు చేశారు. అనంతపురం జట్టులోని గులాం రెండు, హరినాథ్ రెడ్డి రెండు వికెట్లు తీసుకున్నారు. అనంతరం 153 పరుగుల విజయ లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన అనంతపురం జట్టు 18.2 ఓవర్లలో మూడు వికెట్ల నష్టానికి 154 పరుగులు చేసి 7 వికెట్ల తేడాతో ఘనవిజయం సాధించింది. ఆ జట్టులోని షహబుద్దీన్ 51 (నాటౌట్), సర్దార్ 42 (నాట్ అవుట్) పరుగులు చేశారు. విజయవాడ జట్టు లోని శ్రీకాంత్ రెండు వికెట్లు తీసుకున్నాడు.

**కడపపై గోవా జట్టు విజయం**

మధ్యాహ్నం జరిగిన వేరొక మ్యాచ్‌లో కడప జట్టుపై ఏడు వికెట్ల తేడాతో గోవా జట్టు ఘనవిజయం సాధించింది. మొదట బ్యాటింగ్ చేసిన కడప జట్టు 20 ఓవర్లలో ఐదు వికెట్ల నష్టానికి 160 పరుగులు చేసింది. ఆ జట్టులోని అశ్విని కుమార్ రాజు 51( నాటౌట్), ఎన్. శ్రీనివాస్ 49 పరుగులు చేశారు. గోవా జట్టులోని సయ్యద్ అజీమ్ రెండు వికెట్లు తీసుకున్నాడు. అనంతరం 161 పరుగుల విజయ లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన గోవా జట్టు 19.1 ఓవర్లలో మూడు వికెట్ల నష్టానికి 163 పరుగులు చేసి 7 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. ఆ జట్టులోని అ అభ్విజిత్ కదం 89 పరుగులు చేశాడు.

తలబడుతున్న అనంతపురం, విజయవాడ జట్లు

# అవినీతి అక్రమాల భరతం పడతాం

- జగన్ పాలనలో అందరూ బాధితులే
- పేదలపై పన్నుల భారం తగ్గిస్తాం
- పాదయాత్రలో నారా లోకేష్
- నేడు, రేపు యువగళం పాదయాత్రకు విరామం

ప్రజాశక్తి-కురబలకోట

తంబళ్లపల్లె నియోజకవర్గంలో వైసిపి నాయకులు చేస్తున్న అవినీతి అక్రమాల భరతం పడతామనిటిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ అన్నారు. యువగళం పేరుతో లోకేష్ చేపట్టిన పాదయాత్ర 41వ రోజుకు చేరుకుంది. శనివారం అన్నమయ్య జిల్లా తంబళ్లపల్లె నియోజకవర్గం కురబలకోటలోని నందిరెడ్డివారిపల్లె చేనేతనగర్ నుంచి ప్రారంభమైన పాదయాత్ర నందిరెడ్డివారిపల్లె, తట్టివారిపల్లె, అంగళ్లు, దొమ్మనబావి, కంటేవారిపల్లె వరకూ పాదయాత్ర సాగింది. 9.05 కిలోమీటర్లు సాగిన పాదయాత్ర సందర్భంగా ఆయా ప్రాంతాల్లో కురుబలు, కుమ్మరి సామాజిక వర్గాల వారితో మాటామంతి కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ పాలనలో అందరూ బాధితులేనని తెలిపారు. పెట్రోల్, డీజిల్‌పై వేస్తున్న అసాధారణ పన్నుల వలనే నిత్యావసర సరుకుల ధరలు విపరీతంగా పెరిగిపోయాయన్నారు. టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే నిత్యావసర సరుకుల ధరలు తగ్గిస్తామని తెలిపారు. అడ్డగోలుగా పెంచిన అన్ని పన్నులు, పేద వాడిపై పన్నుల భారం తగ్గిస్తామని పేర్కొన్నారు. రాష్ట్రంలో 6 లక్షల పెన్షన్లు కట్ చేశారని తెలిపారు. ఆఖరికి చెత్త పన్ను కూడా పెన్షన్‌లో కట్ చేసే దారుణమైన ప్రభుత్వం మరొకటి లేదన్నారు. టిడిపి ప్రభుత్వం వచ్చిన వెంటనే అర్హులైన అందరికీ పెన్షన్లు ఇచ్చి తీరుతామన్నారు. ప్రతి నియోజకవర్గంలో ఇండస్ట్రియల్ క్లస్టర్స్ ఏర్పాటు చేసి చిన్న, మధ్య తరగతి పరిశ్రమలను ప్రోత్సహిస్తామని తెలిపారు. శాలివాహన సామాజికవర్గ అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని తెలిపారు. ఆదరణ ద్వారా గతంలో వేలాది రూపాయల విలువ చేసే పనిముట్లు అందించామని చెప్పారు. టిడిపి హయాంలో అంగళ్లలో సీఎఫ్సీ భవనం నిర్మించామన్నారు. వారంతా ఒకేచోట ఉండి పని చేసుకుంటున్నారని పేర్కొన్నారు. అధికారంలోకి వచ్చాక కంటెవారిపల్లెలోనూ సీఎఫ్సీ బిల్డింగ్ నిర్మించే ప్రయత్నం చేస్తామని హామీ ఇచ్చారు. కుమ్మరుల ఉత్పత్తుల సేల్‌ను అధికారంలోకి రాగానే తాము ప్రమోట్ చేస్తామన్నారు. కురుబల కోసం తొలుత కురుబ కార్పొరేషన్ ఏర్పాటు చేసి వారి సంక్షేమానికి కృషి చేశామన్నారు. రాబోయే ఎన్నికల్లో టిడిపి అధికారంలోకి వచ్చాక గొర్రెల మేపుకోవడానికి బీడు భూములు కేటాయించే అంశాన్ని పరిశీలిస్తామని హామీ ఇచ్చారు. కురుబల ఆరాధ్య దైవం కనకదాసు జయంతిని అధికారికంగా నిర్వహిస్తామన్నారు. కురుబ భవనాల ఏర్పాటుకు నిధులు కేటాయిస్తామన్నారు.

అంగళ్లు వద్ద పాదయాత్రలో అభివాదం చేస్తున్న నారా లోకేష్

**నేడు, రేపు యువగళం పాదయాత్రకు విరామం**

టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర అన్నమయ్య జిల్లా తంబళ్లపల్లె నియోజకవర్గంలో సాగుతోంది. ఎన్నికల నిబంధనల ప్రకారం ప్రస్తుతం నియోజకవర్గం వీడాలంటూ లోకేష్‌కు ప్రధాన ఎన్నికల అధికారి కార్యాలయం ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా పాదయాత్ర చేసేందుకు ముందుగానే నిర్ణయించుకున్నందున తాను స్థానికంగా అన్నమయ్య జిల్లా కంటేవారిపల్లి విడిది కేంద్రంలో ఉండేందుకు మినహాయింపు ఇవ్వాలని కేంద్ర ఎన్నికల సంఘాన్ని నారా లోకేష్ కోరారు. లోకేష్ పంపిన విజ్ఞప్తిని కేంద్ర ఎన్నికల సంఘం పైవిధంగా స్పందించింది. ఎన్నికల సంఘాన్ని, చట్టాలను గౌరవించి జిల్లా వీడుతున్నట్లు లోకేష్ ప్రకటించారు. కంటేవారిపల్లి నుంచి హైదరాబాద్ బయలుదేరి వెళ్లారు. ఇప్పటి వరకు నడిచిన దూరం 529.1 కిలోమీటర్లు కాగా 41వ రోజు శనివారం నడిచిన దూరం 9.5 కిలోమీటర్లు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ కారణంగా యువగళం పాదయాత్రకు 12, 13వ తేదీల్లో విరామం ప్రకటించారు. 42వ రోజు పాదయాత్ర 14వ తేదీ కంటేవారిపల్లి నుంచి ప్రారంభమవుతుందని పార్టీ శ్రేణులు ప్రకటించారు.

# భూ కబ్జాలపై సిట్టింగ్ జడ్జితో విచారించాలి

### భూపోరాట సాధన కమిటీ జిల్లా కన్వీనర్ బి.నారాయణ

### ఆక్రమణలపై కరపత్రాలు విడుదల

ప్రజాశక్తి - కడప అర్బన్

బద్వేల్‌లో ప్రభుత్వ భూములను కబ్జాచేస్తూ కోట్లాది రూపాయాలు కొల్లగొడుతున్న భూ బకాసురులపై సిట్టింగ్ జడ్జితో విచారణ చేయించాలని భూపోరాట సాధన కమిటీ జిల్లా కన్వీనర్ బి.నారాయణ డిమాండ్ చేశారు. శనివారం పాత బస్టాండ్‌లోని కమిటీ కార్యాలయంలో భూకబ్జాల సమాచారంలో కూడిన కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బద్వేల్ పట్టణంలో దొంగపట్టాలు సృష్టించిన వారిమీద కేసులు పెట్టకుండా, అమా యకులపై ఆర్‌డిఒ, రెవెన్యూయంత్రాంగం కేసులు బనాయించి అరెస్టు చేయి స్తున్నారని విమర్శించారు. భూకబ్జాలకు ప్రధాన సూత్ర, పాత్రదారులైన వైసిపి నాయకులను, బడా కబ్జాదారులను కాపాడేందుకే విచారణ పక్కన పెట్టారని తెలిపారు. దీనికి కలెక్టర్ కూడా వంత పాడుతున్నట్లు తాము మాట్లాడిన సందర్భాల్లో అర్థమైందన్నారు. 977/3 సర్వే నంబరులో మడకలవారిపల్లెలో 2.34 ఎకరాల భూమిని ప్లాట్స్ వేసి అమ్ముతున్నారన్న విషయాన్ని ఆర్‌డిఒ, కలెక్టర్ దృష్టికి తీసుకు వెళ్లామని పేర్కొన్నారు. అఖిలపక్షం పర్యటించి కలెక్టర్, ఆర్‌డిఒకు వినతి పత్రం ఇచ్చినా ఫలితం లేకుండా పోయిందని వాపోయారు. ప్రభుత్వ భూమిని సెంటు రూ.4.50 లక్షలకు విక్రయిస్తున్నారని పేర్కొన్నారు. 1975లో సుబ్బారావు అనే వ్యక్తికి డికెటి ఇచ్చారని తెలిపారు. 1997లో దీనిని రద్దు చేశారని చెప్పారు. 977/1, 977/2,977/4 నంబర్లలో 11ఎకరాలు రద్దు చేసి పేదల ఇళ్లపట్టాలకు ఇచ్చారన్నారు. 977/3 నంబరు ఉన్నవారు కోర్టు పోయారని, కోర్టు స్టే ఇచ్చిందని పేర్కొన్నారు. దీంతో పంపిణీ ఆగిపోయిందని చెప్పారు. కోర్టు ఆదేశాల మేరకు 2010లో 2వ సారి అప్పటి తహశీల్దారు డి.వి.వి.రాజు డికెటి పట్టా రద్దు చేశారని తెలిపారు. హైకోర్టులో పెండింగ్‌లో ఉందన్నారు. ఈ స్థలాన్ని కూడా ప్లాట్స్‌వేసి అమ్ముతున్నారని పేర్కొన్నారు. మడకలవారిపల్లె రెవెన్యూ గ్రామంలో హైవే రోడ్డుకు ఆనుకుని 922/1 నంబరులో 1.08 ఎకరాల స్థలం శశ్మాన భూమిని దర్జాగా కబ్జా చేసి షాపింగ్ కాంప్లెక్స్ ఏర్పాటు చేసుకున్నారని వాపోయారు. ఈ విషయాన్ని ఆర్‌డిఒ దృష్టికి తీసుకువెళితే అభివృద్ధి అనడం సిగ్గుచేటన్నారు. 922/1.922/3 నంబరులో 3.70 భూమితో పాటు వందల ఎకరాలు కబ్జాకు గురైందని, వందల కోట్లు విలువ చేసే భూములు కబ్జాకు గురవుతూ ఉంటే అధికారులకు చీమకుట్టినట్లు కూడా లేదని తెలిపారు. ప్రభుత్వ, ప్రయివేట్ భూములకు రక్షణ లేకుండా పోయిందని తెలిపారు. సిట్టింగ్ జడ్జితో విచారణ చేపట్టాలని, అప్పటి వరకు భూములు అన్యాక్రాంతం కాకుండా చూసే బాధ్యత కలెక్టర్, ఆర్‌డిఒ, రెవిన్యూ యంత్రాంగంపై ఉందని పేర్కొన్నారు. లేని పక్షంలో ఈ నెల 13న ఎంఎల్‌సి ఎన్నికల అనంతరం భూపోరాట సాధన కమిటీ, వ్యవసాయ కార్మిక సంఘం, బిఎస్‌సి, ఆప్, లోక్‌సత్తా, ప్రజాసంఘాలు, కలిసివచ్చే పార్టీలతో పోరాటాలు నిర్వహిస్తామని చెప్పారు. పేదలకు స్థలాలు ఇమ్మని అడిగితే కొండలమీద ఇచ్చే అధికారులు, కోటీశ్వర్లకు, వైసిపి నాయకులకు మాత్రం హైవే రోడ్ల పక్కన స్థలాలు ఇస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో వ్య.కా.స జిల్లా కార్యదర్శి అన్వేష్, బిఎస్‌సి జిల్లా ఇన్‌ఛార్జ్ గుర్రప్ప, ఆప్ సీనియర్ నాయకులు డాక్టర్ శ్రీనివాసులు, లోక్‌సత్తా జిల్లా అధ్యక్షులు దేవర శ్రీకృష్ణ, అంజి పాల్గొన్నారు.



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు



అక్రమంగా వెలసిన ఇళ్లు

## ఎర్రచందనం స్మగ్లర్‌పై పీడీ యాక్ట్ ప్రయోగం

ప్రజాశక్తి - కడప అర్బన్

కరడు గట్టిన అంతర్ రాష్ట్ర ఎర్ర చందనం స్మగ్లర్ షేక్. సింపతిల బాషా పై పీడీ యాక్ట ప్రయోగించినట్లు ఎస్‌పి అన్బురాజన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇతను పదేళ్లుగా ఎర్ర చందనం దుంగల అక్రమ రవాణాకు పాల్పడుతున్నాడని తెలిపారు. 2013వ సంవత్సరం నుంచి ఇప్పటివరకు నిందితుడిపై 71 ఎర్రచందనం కేసులు నమోదయ్యాయని పేర్కొన్నారు. 2003 నుంచి ఇతనిపై 85 దొంగతనం కేసులు నమోదయ్యాయని తెలిపారు. ఇతనికి అనేక మంది అంత ర్జాతీయ ఎర్రచందనం స్మగ్లర్లతో సంబంధాలున్నాయని పేర్కొన్నారు. తమిళనాడు రాష్ట్రం నుంచి కూలీలను తీసుకుని వచ్చి జిల్లాలోని రైల్వే కోడూరు, బాలుపల్లి, సానిపాయ, అట్లూరు, చెన్నూర్, బద్వేల్, గువ్వలచెరువు ఘాట్, సుండుపల్లి ప్రాంతాల్లోని అటవీ ప్రాంతంలో దుంగలను నరికించి వాటిని దుంగలుగా చేయించి కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలకు అక్రమ రవాణా చేసి అంతర్జాతీయ ఎర్రచందనం స్మగ్లర్లకు విక్రయించి అక్రమంగా డబ్బులు సంపాదిస్తున్నాడని తెలిపారు. సింపతిల పై పీడీ చట్టం ప్రకారం చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారని పేర్కొన్నారు. ఎర్ర చందనం అక్రమ రవాణా, రవాణాకు సహకరించిన వారి పై కఠిన చర్యలు ఉంటాయి తెలిపారు. అంతరాష్ట్ర ఎర్రచందనం స్మగ్లర్లను అరెస్టు చేసి పీడీ చట్టం కింద నిర్బంధ ఉత్తర్వులు పొందడానికి కృషి చేసిన సంబంధిత పోలీసు అధికారులను ఎస్.పి అభినందించారు.

స్మగ్లర్ షేక్.సింపతిల బాషా

## పారదర్శక ఎన్నికల నిర్వహణకు సహకరించాలి : ఎస్‌పి

ప్రజాశక్తి - కడప అర్బన్

జిల్లాలో పారదర్శక ఎన్నికల నిర్వహణకు అన్ని వర్గాల ప్రజలు సహకరించాలని, ఎన్నికల నియమ నిబంధనలు ప్రతి ఒక్కరూ పాటించాలని ఎస్ పి అన్బురాజన్ ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు, ఓటర్లు, ఏజెంట్లు ఎన్నికల ప్రవర్తనా నియమావళిని, ఆర్వో అధికారి ఉత్తర్వులను తప్పనిసరిగా పాటించాలని పేర్కొన్నారు. ఓటర్లు, ఏజెంట్లు, అభ్యర్థులు మొబైల్ ఫోన్స్, ఐ పాడ్, టాబ్స్, ఇతర ఎలెక్ట్రానిక్ వస్తువులు పోలింగ్ కేంద్రంలోనికి తీసుకువెళ్లడానికి అనుమతి లేదని తెలిపారు. ఎన్నికల నియమావళి ప్రకారం పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని పేర్కొన్నారు. పోలింగ్ కేంద్రాలకు 100 మీటర్ల దూరం వరకు ఎవరూ గుంపులుగా ఉండకూడదని తెలిపారు. ఎవరూ రెచ్చగొట్టేవిధంగా వ్యాఖ్యలు చేయడం, కవ్వింపు చర్యలకు పాల్పడటం చేయకూదని పేర్కొన్నారు. డబ్బు, మద్యం, వస్తువులు ఎరచూపి ఓటర్లను ప్రభావితం చేసేలా ప్రలోభాలకు పాల్పడరాదని తెలిపారు. పోలింగ్ బూత్ లోపల ఫొటోలు, వీడియోలు తీసి ఎన్నికల నియమ నిబంధనలకు విరుద్ధంగా సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఎవరైనా ఎన్నికల నియమాలను ఉల్లంఘించినా, అతిక్రమించినా, చట్ట వ్యతిరేకంగా ప్రవర్తించినా ఎన్నికల కమిషన్‌కి, స్థానిక పోలీసులకు, డయల్ 100 కు సమాచారం అందించాలని తెలిపారు.

## వ్యాయామ అధ్యాపకునికి గోల్డ్ మెడల్ ప్రదానం

ప్రజాశక్తి - కడప అర్బన్

కెఎస్ఆర్ఎం ఇంజినీరింగ్ కళాశాలలో వ్యాయామ అధ్యాపకులుగా పనిచేస్తున్న వంశీ నాయక్ గోల్డ్ మెడల్ అందుకున్నారు. మహారాష్ట్రలోని జవహర్లాల్ నెహ్రూ క్రీడా మైదానంలో ఈ నెల 3, 5వ తేదీలలో అంతర్జాతీయ సిస్టోబాల్ ఛాంపియన్‌షిప్-2023 పోటీలలో భారత్ వర్సెస్ బంగ్లాదేశ్ జట్ల మధ్య హోరాహోరీగా నిర్వహించిన క్రీడా పోటీల్లో వంశీ నాయక్ ప్లేయర్ ఆఫ్ ది ఇయర్‌గా ఎంపికై బంగారు పతకం కైవసం చేసుకున్నారని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వి. ఎస్. ఎస్. మూర్తి మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కందుల చంద్ర ఓబుల్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం కమలాపురం ఎంఎల్ఎ పి. రవీంద్రనాథ్‌రెడ్డితో కలిసి వ్యాయామ అధ్యాపకుడిని సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిన్న వయసులోనే అంతర్జాతీయ స్థాయిలో సిస్టోబాల్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో ప్లేయర్‌గా గెలుపొంది బంగారు పతకం సాధించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించి భారతదేశానికి ఉత్తమ సేవలు అందించాలని ఆకాంక్షించారు. అనంతరం కళాశాల యాజమాన్యం, అడ్మినిస్ట్రేటివ్ మేనేజర్ పి. ప్రేమ్‌కుమార్, విభాగాల హెచ్‌ఒడిలు, డీన్లు, ఫిజికల్ డైరెక్టర్ నారాయణ, కళాశాల సిబ్బంది, విద్యార్థులు వంశీనాయక్‌ను అభినందించారు.

వంశీ నాయక్‌ను సన్మానిస్తున్న కమలాపురం ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి

## క్రీడలతో మానసిక ఉల్లాసం

**ప్రజాశక్తి - వల్లూరు**

యువకులకు క్రీడలు ఎంతో అవసరమని, క్రీడల వల్ల మానసిక ఉల్లాసం కలుగుతుందని ఎస్ఐ విష్ణువర్ధన్ తెలిపారు. మండలంలోని అక్షింతరాయపల్లి ప్రీమియర్ లీగ్ ఆధ్వర్యంలో జరుగుతున్న క్రికెట్ టోర్నమెంట్ పోటీలను శనివారం ఎస్ఐ, టిడిపి నాయకులు కాశిభట్ల సైనా శర్మ తన యుడు మణికంఠశర్మ టాస్‌వేసి ప్రారం భించారు. ఇరుజట్లకు శుభాకాంక్షలు తెలిపి మ్యాచ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూక్రీడా స్ఫూర్తితో ఆడి బహుమతులు గెలవాలని క్రీడాకారులకు సూచించారు. కార్యక్రమంలో క్రీడాకారులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

టాస్ వేస్తున్న ఎస్ఐ విష్ణువర్ధన్

## నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

**ప్రజాశక్తి - వేంపల్లె**

వేంపల్లెలోని 33/11 కెవి సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు చేస్తున్నందున ఆదివారం ఆయా ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలిపేస్తున్నట్లు విద్యుత్ శాఖ జెఇ చంద్రశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 7.30 గంటల నుండి 10.30 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. ఈ నేపథ్యంలో టీచర్స్ కాలనీ, లయన్స్ నగర్, రాజీవ్‌నగర్ కాలనీ, ఎన్టీఆర్ సర్కిల్, పులివెందుల రోడ్డు, సాయినగర్, పిరమిడ్ నగర్, చైతన్య స్కూల్, కాపువీధి, పాతపేట, అమ్మవారిశాల, ఎస్సీ కాలనీ, గాజులపేట, గాండ్లవీధి, ప్రియా తోట, రెడ్డయ్య కాలనీ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని తెలిపారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

**చక్రాయపేట :** మండలంలోని నాగులగుట్టపల్లి, కె.ఎర్రగుడి, సిద్దారెడ్డిపల్లె విద్యుత్ సబ్‌స్టేషన్‌ల మరమ్మతుల కారణంగా ఆదివారం ఉదయం 8.30గంటల నుంచి 11.30నిమిషాల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ట్రాన్స్‌కో ఎఇఇ ప్రవీణ్‌కుమార్ యాదవ్ తెలిపారు. ఈ విషయాన్ని వినియోగదారులు గమనించాలని ఆయన కోరారు.

## తాత్కాలికంగా 'స్పందన' రద్దు

**ప్రజాశక్తి - రాయచోటి**

పట్టభద్రులు, ఉపాధ్యాయుల శాసనమండలి ఎన్నికల పోలింగ్ నేపథ్యంలో ఈ నెల 13న నిర్వహించనున్న స్పందన అర్జీల స్వీకరణ కార్యక్రమాన్ని తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ గిరీష పిఎస్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అర్జీదారులు ఈవిషయాన్ని గమనించి స్పందన ఫిర్యాదులను సమర్పించేందుకు కలెక్టరేట్‌కు రావద్దని తెలిపారు.

## సేవా కార్యక్రమాలు సంతోషకరం

**ప్రజాశక్తి - వేంపల్లె**

ఇడుపులపాయి ట్రిపుల్ ఐటి ఎన్ఎస్ఎస్ యూనిట్ సేవా కార్యక్రమాలను చేపట్టడం సంతోషకరమని ఆర్‌కె వ్యాలీ ఎస్ఐ రంగారావు పేర్కొన్నారు. చక్రాయపేట మండలంలోని మారేళ్ల మడక గ్రామంలో శనివారం ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో ఎస్ఐ రక్తదానం చేశారు. ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వ ర్యంలో నాలుగు రోజులుగా చక్రాయపేట మండలంలో మొక్కలు నాటే కార్య క్రమంతోపాటు ఆయా కార్య క్రమాలు నిర్వహించారు. ఎస్ఐతోపాటు మరో 50 మంది యువకులు రక్తదానం చేశారు. అనంతరం ఎస్ఐ మాట్లాడుతూ రక్తదానం చేయడం వల్ల రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన వారికి, గర్భిణులకు అవసరమైన రక్తం సరఫరా చేయవచ్చన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీహరి, సచివాలయం ఆరోగ్య కార్యకర్త నవనీత, ట్రిపుల్ ఐటీ ఎన్ఎస్ఎస్ యూనిట్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ రమేష్‌బాబు, ట్రిపుల్ ఐటీ విద్యార్థులు, సిబ్బంది ప్రసాద్ పాల్గొన్నారు.


రక్తం ఇస్తున్న ఎస్ఐ రంగారావు

కేక్ కట్ చేస్తున్న టిడిపి నాయకులు

## ఘనంగా పుట్టా రవికుమార్ పుట్టినరోజు వేడుకలు

**ప్రజాశక్తి - ఖాజీపేట**

మైదుకూరు టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పుట్టా సుధాకర్ యాదవ్ తనయుడు, పిఆర్‌కె హాస్పిటల్ ఎండి డాక్టర్ రవికుమార్ పుట్టినరోజు వేడుకలను శనివారం సర్వర్‌ఖాన్‌పేటలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కడప పార్లమెంట్ టిడిపి జాయింట్ సెక్రెటరీ కమలాపురం గౌస్ ఆధ్వర్యంలో పార్టీ మండలశాఖ అధ్యక్షులు తిప్పిరెడ్డి లక్ష్మిరెడ్డి సమక్షంలో కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు పిచ్చి నాయుడు, వీరయ్య, రాము యాదవ్, రామానాయుడు, కమలాపురం నూర్, కృష్ణారెడ్డి, ఖాసీంపీరా, జానకి రాముడు, రాఘవ, వి.మహబూబ్ బాషా, షేక్ గౌస్, షేక్ ఇర్ఫాన్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## 104 సేవలను సద్వినియోగం చేసుకోండి

**ప్రజాశక్తి - కలకడ**

104 వైద్య సేవలను గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎర్రకోటపల్లి వైద్యాధికారి కిషోర్‌కుమార్‌రెడ్డి సూచించారు. శనివారం మండలంలోని ఎర్రకోటపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో గంగాపురం, కత్తి వారిపల్లిలో డాక్టర్ యంవి. కిషోర్ కుమార్‌రెడ్డి ఆధ్వ ర్యంలో ఫ్యామిలీ పిజిషన్ కార్యక్రమాన్ని నిర్వహిం చినట్లు తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణులు, బాలింతల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆరోగ్యకార్యకర్తలకు, ఆశ వర్కర్లకు సూచించారు. మాతృ శిశు మరణాలు జరగకుండా జాగ్రత్త వహించాలని తెలిపారు. 60 ఏళ్లు పైబడిన వారందరికీ రక్త పరీక్షలు నిర్వహించి మందులుపంపిణీ చేశామని చెప్పారు. 94 మందికి వైద్య సేవలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేసినట్లు తెలిపారు. అంగన్వాడీ కేంద్రాన్ని తనిఖీ చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎంపిహెచ్‌సిఒ జయరామయ్య ఆరోగ్యకార్యకర్త సి.లక్ష్మిదేవి, ఎంఎల్‌హెచ్‌పిజె గోపిక్రిష్ణ, గణాంధిక అధికారి రోజా, ఫైలెట్ రమేష్, అమరావతి పాల్గొన్నారు.

వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్ కిషోర్‌కుమార్‌రెడ్డి

## పాదయాత్రకు తరలివెళ్లిన టిడిపి శ్రేణులు

**ప్రజాశక్తి - పెద్దమండ్యం**

జాతీయ టీడీపీ కార్యదర్శి మాజి ముఖ్యమంత్రి తనయుడు నారా లోకేష్ తలపెట్టిన యువగళం పాదయాత్ర తంబళ్లపల్లి నియోజకవర్గం లో జరుగుతున్న పాదయాత్ర లో మండల అధ్యక్షులు జిట్టా వెంకటరమణ ఆధ్వర్యంలో టీడీపీ కార్యకర్తలు కురభలకోట మండలం అంగల్లులో జరుగుతున్న పాదయాత్రకు మండలం లోని నాయకులు తరలి వెళ్లారు. మండల అధ్యక్షులు జిట్టా వెంకటరమణ మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ విజయం సాధించేలా ప్రతి ఒక్కరు కృషి చేయాలనీ పిలుపునిచ్చారు. ఈ పాదయాత్ర కు నాయకులు, యువకులు, మహిళలు భారీ ఎత్తున ఈ కార్యక్రమంనకు తరలి వెళ్లారు.

# పసుపు నూర్పిడి పనులు ప్రారంభం

**ప్రజాశక్తి - చాపాడు**

రైతు బంగారంగా పేరొందిన పసుపు పంట నూర్పిడి పనులు ప్రారంభమయ్యాయి. నాణ్యత ఆశాజనకంగా ఉన్నట్లు రైతులు అభిప్రాయపడుతున్నారు. మండల పరిధిలో సుమారుగా రెండు వందల ఎకరాల్లో రైతులు పసుపు సాగు చేశారు. ప్రస్తుతం ఎద్దులతో, కూలీల ద్వారా దుక్కులు సాగిస్తున్నారు. చాపాడు, సీతారామపురం, చిన్నగురువలూరు, పెద్ద గురువలూరు, లక్ష్మీపేట, కేతవరం గ్రామాల పరిధిలో పసుపు రైతులు పనులు ప్రారంభించారు. ఎకరాకు 30 పుట్ల వరకు దిగుబడి వస్తున్నదని రైతులు చెబుతున్నారు. ఈ ఏడాది అధిక వర్షాల కారణంగా తెగుళ్ళతో దిగుబడి తగ్గిందని రైతులు పేర్కొంటున్నారు. రూ.లక్ష వరకు సాగు ఖర్చులు అయ్యాయని తెలిపారు. ఏడాది పంట కావడంతో కొనుగోలు దగ్గర నుండి సాగు, కూలీలు, ఎరువులు, మందులు కలిపి అధికంగా ఖర్చులు ఉన్నాయని రైతులు వివరించారు. కెసి కెనాల్ నీటి ఆధారంగా బోరు బావుల ద్వారా రైతులు పసుపు సాగు చేపడుతున్నారు. మైదుకూరు, దువ్వూరు మండలాల్లో రైతులు మరింత కాస్త ఆలస్యంగా దుక్కిళ్ళు చేసే అవకాశాలు ఉన్నాయి. మైదుకూరు మండలంలో విత్తనం కోసం ఏప్రిల్, మే నెలల్లో దుక్కులు చేపడతామని పేర్కొంటున్నారు.

పసుపు నూర్పిడి చేస్తున్న కూలీలు

# సాగునీటి రంగంపై నిర్లక్ష్యం : పిసిసి

**ప్రజాశక్తి - వేంపల్లె**

వైసిపి పాలనలో సాగునీటి రంగం పూర్తిగా నిర్లక్ష్యానికి గురైందని పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి అన్నారు. శనివారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ 2023-24 బడ్జెట్‌లోనైనా సాగునీటి రంగానికి అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. రాష్ట్రంలో వ్యవసాయం ప్రధానమైందన్నారు. వ్యవసాయానికి సాగునీటి రంగం గుండెకాయ లాంటిదన్నారు. అలాంటి సాగునీటి రంగానికి బడ్జెట్‌లో ఎక్కువ నిధులు కేటాయించి, ఖర్చు చేయడం ప్రభుత్వ బాధ్యత అన్నారు. కాంగ్రెసు ప్రభుత్వాలు మొదటి నుండి కూడా సాగునీటి రంగానికి మొత్తం బడ్జెట్‌లో 15 నుండి 17 శాతం నిధులు కేటాయించి ఖర్చు చేసేవని అన్నారు. అందువల్లనే శ్రీశైలం రిజర్వాయర్, నాగార్జున సాగర్ ప్రాజెక్టు, ప్రకాశం బ్యారేజీ, ధవళేశ్వరం బ్యారేజీ పూర్తయినట్లు తెలిపారు. తెలుగుగంగ, గాలేరి-నగరి, హంద్రీ-నీవా, వెలిగోడు, పులిచింతల వంటి భారీ సాగునీటి ప్రాజెక్టుల్లో సింహ భాగం పనులు కాంగ్రెస్ హయాంలోనే జరిగాయన్నారు. పోలవరం ప్రాజెక్టు పనులు 32 శాతం కాంగ్రెస్ హయాంలోనే పూర్తయ్యాయన్నారు. జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించిందన్నారు. టిడిపి హయాంలో మొత్తం బడ్జెట్‌లో 9 శాతం మేరకే సాగునీటి రంగంపై ఖర్చు చేసిందన్నారు. వైసిపి పాలనలో సాగునీటి రంగానికి మరింత నిర్లక్ష్యం చేసిందని తెలిపారు. మొత్తం బడ్జెట్‌లో 5 శాతం మాత్రమే కేటాయించి, అందులో సగం మాత్రమే ఖర్చు చేసిందన్నారు. 2019-20లో బడ్జెట్ రూ.13139 కోట్లు కేటాయించి, రూ.5335 కోట్లు (40శాతం) ఖర్చు చేసిందని చెప్పారు. 2020-21లో రూ.11806 కోట్లు కేటాయించి, రూ.5228 (44శాతం) చేసిందన్నారు. 2021-22లో రూ.13518 కోట్లు కేటాయించి, రూ.8428 కోట్లు ఖర్చు చేసినట్లు వివరించారు. 2022-23లో రూ.11482 కోట్లు కేటాయించిందని చెప్పారు. కేటాయింపులు తగ్గడంతోపాటు కేటాయించిన నిధులు కూడా ఖర్చు చేయకపోవడంతో రాష్ట్రంలోసాగునీటి ప్రాజెక్టులు నత్తనడకన సాగుతున్నాయని విమర్శించారు. కనీసం 2023-24 బడ్జెట్‌లోనైనా 15 శాతం కేటాయించి ఖర్చు చేయాలని తులసిరెడ్డి కోరారు.

# భలే బాగు.. బీర సాగు

## - ఆదాయాన్నిస్తోందని రైతుల్లో హర్షం

బీరకాయలను ఎగుమతికి సిద్ధం చేస్తున్న కూలీలు

**ప్రజాశక్తి - చాపాడు**

మండల పరిధిలో సాగు చేసిన బీర సాగు లాభాలన్నిస్తోందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని సీతారామపురం గ్రామ పరిధిలో బీర పంటను రైతులు సాగు చేశారు. ఎకరా కోతకు రెండు టన్నుల వరకు దిగుబడి వస్తోంది. మూడు నాలుగు రోజులకు ఒకసారి దిగుబడి వస్తుంది. కిలో రూ.25 ప్రకారం ప్రొద్దుటూరు, హైదరాబాదు, నెల్లూరు, తిరుపతి వంటి నగరాలకు ఎగుమతి అవుతున్నాయి. వ్యాపారులే పంటపొలాల వద్దకు వచ్చి కొనుగోలు చేసి తీసుకెళ్తున్నారు. రైతులే పంటను తరలిస్తే మరో రెండు రూపాయలు అదనంగా చెల్లిస్తున్నట్లు సమాచారం. ఎకర సాగుకు రూ.యాభై వేల వరకు ఖర్చులు అవుతున్నాయని రైతులు పేర్కొంటున్నారు. ఆ తర్వాత ఎరువులు, పురుగుమందులు మరింత ఖర్చులు వస్తాయని వివరించారు. పది రోజులుగా ఎండ తీవ్రతకు చెట్లు దెబ్బతింటున్నాయని, దిగుబడి సరిగా లేదని రైతులు పేర్కొంటున్నారు. కర్రలపైన బీర సాగు చేపట్టడం వలన కాయలు పొడవుగా ఏర్పడి మంచి దిగుబడి వస్తోందని రైతులు పేర్కొంటున్నారు. సీతారామాపురం గ్రామ పరిధిలో 10 ఎకరాలు, మండల పరిధిలో వివిధ గ్రామాల్లో మరో 10 ఎకరాల్లో బీరసాగులో ఉంది. అట్టపెట్టెలలో బీరకాయలను పేర్చి ఇతర ప్రాంతాలకు రవాణా చేస్తున్నారు. వరి పంట సాగు అనంతరం కూరగాయలు సాగు చేపట్టడం వలన మంచి లాభాలు వస్తున్నాయని రైతులు పేర్కొంటున్నారు.

# విద్యుత్ వృథా.. అధికారులకు పట్టదా..?

**ప్రజాశక్తి - ఖాజీపేట**

విద్యుత్ పొదుపు.. ప్రగతికి మలుపు. ఒక యూనిట్ విద్యుత్ ఆదా వెయ్యి యూనిట్ల ఉత్పత్తితో సమానం అంటూ ఆ శాఖ అధికారులు విద్యుత్ పొదుపు చర్యలపై పెద్ద ఎత్తున ప్రచారం సాగిస్తున్నా.. క్షేత్రస్థాయిలో మాత్రం అందుకు భిన్నమైన పరిస్థితులు కనిపిస్తున్నాయి. విద్యుత్ దీపాలు పగలు, రాత్రి అని తేడా లేకుండా వెలుగుతూనే ఉన్నాయి. విద్యుత్ పెద్ద ఎత్తున వృథా అవుతున్నా సంబంధిత అధికారులు పొదుపు చర్యలు చేపట్టడంలో పూర్తిగా విఫలమయ్యారనే ఆరోపణలున్నాయి. ఖాజీపేట పట్టణంలోని పలు కాలనీల్లో విద్యుత్ వీధి దీపాలు వెలుగుతూనే ఉన్నాయి. వాటిని ఆర్పేందుకు సిబ్బంది ఎలాంటి చర్యలు తీసుకోలేదనే విమర్శలున్నాయి. స్థానిక అగ్రహారం, టీచర్స్ కాలనీ, సొసైటీ కాలనీలో పగలు కూడా వీధి దీపాలు వెలుగుతున్నాయి. పంచాయతీలకు విద్యుత్ దీపాలు గుదిబండంగా మరినా, పంచాయతీ అధికారులు, విద్యుత్ శాఖ అధికారులుగానీ చర్యలు తీసుకోలేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి విద్యుత్ దీపాలు నిరంతరాయంగా వెలగకుండా పొదుపు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

టీచర్స్ కాలనీలో నిరంతరాయం వెలుగుతున్న వీధి దీపం

# పిడిఎఫ్ అభ్యర్థులను గెలిపించండి : సిఐటియు

మాట్లాడుతున్న సత్యనారాయణ

**ప్రజాశక్తి - ప్రొద్దుటూరు**

పిడిఎఫ్ మద్దతుదారులు పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోతుల నాగరాజును, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కత్తి నరసింహారెడ్డిని గెలిపించాలని సిఐటియు జిల్లా కార్యదర్శి సత్యనారాయణ కోరారు. స్థానిక సిఐటియు కార్యాలయంలో శనివారం సాయంత్రం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. నాగరాజు సామాజిక కార్యకర్తగా ప్రజా సమస్యలపై అనేక ఉద్యమాలు చేశారన్నారు. ఇలాంటి వ్యక్తి శాసన మండలిలో ఉంటే ప్రజలకు సమాజానికి మంచి జరుగుతుందన్నారు. నాగరాజును మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా పోటీలో ఉన్న కత్తి నరసింహారెడ్డికి మొదటి ప్రధాన్యతా ఓటు వేసి గెలిపించాలన్నారు. కత్తి నరసింహారెడ్డి నిత్యం ప్రజా సమస్యలపై పని చేస్తున్నారన్నారు. స్వార్థ రాజకీయ నాయకులను తరిమికొట్టి పిడిఎఫ్ మద్దతుదారులను గెలిపించాలని ఆయన కోరారు. సమావేశంలో ఎస్ఎఫ్ఐ నాయకులు నరసింహ, సిఐటియు నాయకులు ఓబయ్య పాల్గొన్నారు.

## 30 కి.మీ. దూరంలో పరీక్ష కేంద్రం

### - ఆందోళనలో ఇంటర్ విద్యార్థులు

**ప్రజాశక్తి - గాలివీడు**

ఈ నెల 15 నుంచి 29వ తేదీ వరకు ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. పరీక్ష లను జంబ్లింగ్ విధానంలో నిర్వహించేందుకు అధికారులు ఇప్పటికే ఏర్పాట్లను పూర్తి చేశారు. మండల కేంద్రమైన గాలివీడులో మూడు ఇంటర్ కళాశాలల విద్యార్థులకు 30 కి.మీ దూరంలో ఉన్న జిల్లా కేంద్రం రాయచోటిలో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. 265 మంది ఇంటర్ విద్యార్థులు రాయచోటికి వెళ్లి పరీక్షలు రాయనున్నారు. 1992 సంవత్సరం నుంచి ఇక్కడే ఉన్న ఆర్ఆర్ జూనియర్ కళాశాల పరీక్షా కేంద్రంగా కొనసాగుతుండేది. 2006వ సంవత్సరం నుంచి జంబ్లింగ్ విధానంలో భాగంగా రాయచోటిలో పరీక్షలను నిర్వహిస్తున్నారు. ప్రాక్టికల్ పరీక్షలు కూడా అక్కడే జరుపుతున్నారు. ప్రతి రోజూ 30 కి.మీ దూరం వెళ్లి పరీక్షలు రాయాలంటే విద్యార్థులు, తల్లిండ్రులు ఆందోళనకు గురవుతన్నారు. పరీక్షలు ముగిసేంత వరకు విద్యార్థికి, సహాయకునికి ప్రతిరోజూ రూ.300 వరకు ఖర్చవుతుంది. ఇంటర్మీడియట్ పరీక్షకు ఆర్ఆర్ జూనియర్ కళాశాల, ఎంఎన్ఆర్ జూనియర్ కళాశాల, కెజిబివి జూనియర్ కళాశాలలో విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారు. ఆర్ఆర్ జూనియర్ కళాశాలలో 197 మంది, ఎంఎన్ ఆర్ జూనియర్ కళాశాలలో 38 మంది, కస్తూర్బా గాంధీ జూనియర్ కళా శాలలో 30 మంది పరీక్ష రాస్తున్నారు. విద్యార్థుల కష్టాలను దృష్టిలో ఉంచుకొని అధికారులు తగు ఏర్పాట్లు చేయాలని తల్లిదండ్రులు కోరు తున్నారు.

## బార్ అసోసియేషన్ అధ్యక్షులుగా నరసింహులు

**నందలూరు :** నందలూరు బార్ అసోసియేషన్ అధ్యక్షులుగా దాసరి నరసింహులు నాలుగవ సారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శనివారం బార్ అసోసియేషన్‌లో జరిగిన సమావేశంలో న్యాయవాది ఒ.వి.కృష్ణారెడ్డి ఎలక్షన్ అధికారిగా కార్యక్రమాన్ని నిర్వహించగా సభ్యులందరూ దాసరి నరసింహులును బార్ అసోసియేషన్ అధ్యక్షులుగా నాలుగవ సారి ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. ఉపాధ్యక్షులుగా షేక్ మహమ్మద్ అలీ, సెక్రటరీగా గొబ్బిల సుబ్బరామయ్య, జాయింట్ సెక్రటరీగా ఎన్. అనుదీప్ జయసింహ, ట్రెజరర్‌గా వినయ్, లైబ్రేరియన్ సెక్రటరీగా మాడపూరి నళిని, కల్చరల్ సెక్రటరీగా హెచ్. ఆనందకుమార్, స్పోర్ట్స్ సెక్రటరీగా సయ్యద్‌అలీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సమావేశంలో సీనియర్ న్యాయవాదులు మల్లికార్జున, మేఘనాదం, శంకర్ లు పాల్గొని ఏకగ్రీవ తీర్మానం చేశారు. ఈ సందర్భంగా దాసరి నరసింహులు మాట్లాడుతూ బార్ పురోభివృద్ధికి , నూతన కోర్టు భవనానికి కృషి చేస్తానని తెలిపారు.

## జగ్జీవన్ రామ్ విగ్రహం ఏర్పాటు చేయాలి

**ప్రజాశక్తి - పోరుమామిళ్ల టౌన్**

అంబేద్కర్ స్మృతి వనంలో అంబేద్కర్‌తో పాటు జగ్జీవన్ రామ్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని ఎపి ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర కార్యదర్శి ఎస్. నారాయణ, జిల్లా అధ్యక్షులు కె. ఓబయ్య డిమాండ్ చేవారు. శనివారం ఆది ఆంధ్ర పాలెంలో ఇందుకు సంబంధించి కరపత్రాలు విడుదల చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా విజయవాడ నగర నడిబొడ్డున భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ పేరుతో స్మృతి వనం ఏర్పాటు చేయడం, అందులో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 125 అడుగుల కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేయడం ఎంతో సంతోషమన్నారు. అదే విధంగా డాక్టర్. బాబు జగజీవన్ రామ్ విగ్రహాన్ని కూడా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు ఈనెల 24న విజయవాడలో పేరిపోగు వెంకటేశ్వరరావు అధ్యక్షత దళిత, గిరిజన సంఘాలతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంఆర్‌పిఎస్ బి. కోడూరు మండల అధ్యక్షులు గంగిపోగు శ్రీనివాసులు, ఉపాధ్యక్షుడు జయరాములు, పోరుమామిళ్ల మండల అధ్యక్షులు పి. శేఖర్, పి. ఆల్బర్ట్, బి. జయరాజు, రాజు పాల్గొన్నారు.

అన్నదానం చేస్తున్న పివి రాఘవరెడ్డి

## అహోబిలంలో అన్నదానం

**ప్రజాశక్తి - ఖాజీపేట**

నంద్యాల జిల్లా అహోబిలంలోని శ్రీ లక్ష్మీనృసింహస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా శనివారం ఖాజీపేటకు చెందిన పిట్టా ఓబులేష్ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమాన్ని ఖాజీపేట అగ్రహార పరపతి సంఘం అధ్యక్షులు పివి రాఘవరెడ్డి ప్రారంభింపజేశారు. ఈ సందర్భంగా రాఘవరెడ్డి మాట్లాడుతూ.. అన్నదాన కార్యక్రమం పుణ్యప్రదమన్నారు. ఇలాంటి సేవా కార్యక్రమాలను చేపట్టేందుకు యువత ముందుకు రావడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో నాయకులు సుబ్బారావు, పైడేల శ్రీనివాసరెడ్డి, వెంకటరెడ్డి, జగదీశ్వర్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి పాల్గొన్నారు.

పోలింగ్ బూత్‌ను పరిశీలిస్తున్న సిఐ వెంకటేశ్వర్లు

## ఎన్నికల నిర్వహణకు గట్టి బందోబస్తు

**ప్రజాశక్తి - వేంపల్లె**

పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణలో పోలీసులు కట్టుదిట్టంగా బందోబస్తు చర్యలు చేపట్టారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలింగ్ బూత్‌ల వద్ద బందోబస్తు ఏర్పాటు చేస్తామని సిఐ వెంకటేశ్వర్లు తెలిపారు. శనివారం వేంపల్లె జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్‌లను సిఐ పరిశీలించారు. జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో మూడు పోలింగ్ బూత్‌లను ఏర్పాటుచేయగా, వాటిలో ఒకటి ఉపాధ్యాయులకు, 2 పట్టభద్రులకు కేటాయించారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎలాంటి సంఘటనలు జరగకుండా ప్రజలు సహకరించాలని సిఐ కోరారు. ఎన్నికల్లో జనాలు గుంపులుగా ఉండకూడదని చెప్పారు. కార్యక్రమంలో ఎస్ఐ తిరుపాల్ నాయక్ పాల్గొన్నారు.

### పోలింగ్‌కు ముమ్మరంగా ఏర్పాట్లు

**చాపాడు :** పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి సోమవారం ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో స్థానిక జిఎన్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాట్లు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ఈ ఎన్నికలకు సంబంధించి రెండు వేర్వరు రూములను సిద్ధం చేస్తున్నారు. తహశీల్దార్ సుభాని ఆధ్వర్యంలో రెవిన్యూ సిబ్బంది బారికేడ్లు, పోలింగ్ సిబ్బందికి అవసరమైన ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. మండల పరిధిలో 1117 పట్టభద్రుల, 59 మంది ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి సంబంధించి ఓటర్లున్నారు. సిఐ నరేంద్రరెడ్డి ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నారు. ఫ్లయింగ్ స్కాడ్‌గా పిఆర్ ఎఇ ఈశ్వరయ్య, ఇఒపిఆర్‌డి రాధాకృష్ణవేణి గ్రామాల్లో ఓటర్లను ప్రలోభాలకు గురి చేయకుండా పర్యవేక్షణ చేస్తున్నారు.

జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని పోలింగ్ కేంద్రం

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంఆర్‌పిఎస్ నాయకులు

## గుర్తింపు కార్డులు జారీ చేయాలి : ఎంఆర్‌పిఎస్

**ప్రజాశక్తి - ముద్దనూరు**

వ్యవసాయ కూలీలకు రాష్ట్ర ప్రభుత్వం గుర్తింపు కార్డులు జారీ చేసి, ఆరోగ్య భద్రత బీమా సౌకర్యం కల్పించాలని ఎపి ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దండు వీరయ్య మాదిగ కోరారు. మండలంలోని యామవరం గ్రామంలో శనివారం చలో నంద్యాల అంతర్జాతీయ మహిళా ప్రభంజనం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జంబూ ద్వీపం పథకం ద్వారా ఎస్సీ, ఎస్‌టి, బిసి, మైనార్టీ అగ్రకులాల పేదలకు 400 యూనిట్లు ఉచిత విద్యుత్ సౌకర్యం కల్పించాలన్నారు. అంతర్జాతీయ మహిళా ప్రభంజనం 5వ వార్షికోత్సవం సందర్భంగా ఈనెల 18న నిర్వహించనున్న చలో నంద్యాల కార్యక్రమానికి తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు నాగభూషణం, సత్యానంద స్వామి, సర్పంచు అనసూయ, మండల నాయకులు పుల్లయ్య, పవన్‌కుమార్, బాలఓబయ్య పాల్గొన్నారు.

## ఎంపీ మిథున్‌రెడ్డి సవాల్‌కు లోకేష్ సిద్ధమా?

**బి.కొత్తకోట :** రాజంపేట ఎంపీ మిథున్ రెడ్డి సవాల్‌కు నారా లోకేష్ సిద్ధమా అని వైసిపి జిల్లా ఉపాధ్యక్షులు పాగొండ ఖలీల్ అహ్మద్ ప్రశ్నించారు. శనివారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ రెండు రోజుల కిందట మదనపల్లి పాదయాత్ర సందర్భంగా తంబళ్లపల్లి నియోజకవర్గం అభివృద్ధిపై చర్చకు సిద్ధమా అని సవాల్ విసిరిన నేపథ్యంలో ఆ సవాల్ ను స్వీకరించిన ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డిలు స్వీకరించారని అన్నారు. ఆదివారం తాము తంబళ్లపల్లిలోనే ఉంటామని, ఏ అంశంపైనైనా చర్చించేందుకు సిద్దంగా ఉంటామని వారు ప్రతి సవాల్ విసిరారని చెప్పారు. ఈ ప్రతిసవాల్‌ను లోకేష్ స్వీకరించగలరా అని పాగొండ ఖలీల్ పేర్కొన్నారు.

## ఎపిటిఎఫ్ జిల్లా కార్యదర్శిగా కుమార్ యాదవ్

**కలికిరి :** ఎపిటిఎఫ్ జిల్లా కార్యదర్శిగా కుమార్ యాదవ్‌ను ఏక గ్రీవంగా ఎన్నుకున్నట్లు రాష్ట్ర కార్యదర్శి చిరంజీవి తెలిపారు. జిల్లా కేంద్రం రాయచోటిలో జిల్లా కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా కార్యదర్శిగా కలికిరికి చెందిన పోతినేని కుమార్ యాదవ్, అధ్యక్షు లుగా ఇలియాజ్ అహ్మద్‌అలీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఎన్నికైన కుమార్‌యాదవ్ మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలపై పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.

**SPECIAL COURT -1**
**BEFORE THE MOTOR ACCIDENTS CLAIMS TRIBUNAL AT CHENNAI**
**M.C.O.P.NO. 4869 OF 2021**

1. P. Manjula
2. P. Kowsalya
3. P. Venu Madhav, Minor, Aged 18 years,
4. P. Purushotham, Minor, Aged 16 years,
(Minor petitioners 3 &4 are Rep.by her Mother & 1 st petitioners herein)
5. P. Sundramma ...Petitioners

Vs

1. Mr. Veluru Vamsi Krishna
2. The Manager
The Royal Sundaram General Insurance Co. Ltd. .....Respondents

To
Mr.Veluru Vamsi Krishna,
S/o V. Venkatakrishnaiah, No. 6/424, Madaras Road, RLY Kodur,YSR Kadappa District, Andhra-Pradesh State.

Sri,
The above M.C.O.P was filed by the Petitioners against you before the Special Court, Chennai and ordered notice to you, returnable by 21.04.2023, please Take notice that the above M.C.O.P Case was posted on 21.04.2023 for your appearance and appear on that day at 10.30 A.M, either in person or Through your counsel, Failing which the matter will be called in your Absence and decided on merits.

**Mr. J.SARAVANAN, B.SC, B.L,**
Counsel for the Petitioners